
సాక్షి తిరుపతి

బుధవారం । 1 । అక్టోబర్ । 2025



నష్టాల 'నిమ్మ'

నిమ్మ ధరలు రోజురోజుకు పతనం అవుతుండడంతో రైతులు నష్టాలపాలవుతున్నారు. దీంతో చెట్లను తొలగిస్తున్నారు. - IIలో



దేవదేవుడి అభయం

తుమ్మలగుంటలోని కల్యాణ వేంకటేశ్వరుని ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. - IIలో



శ్రీగంధం దుంగలు స్వాధీనం

తిరుపతి నగరవనంలోని శ్రీగంధం దుంగలను నరికి ,అక్రమంగా తరలిస్తున్న నిందితులను పట్టుకొని అరెస్టు చేశారు. - IIలో

న్యూస్‌రీల్

అర్జీదారులపై స్థానిక నేతల ఒత్తిళ్లు

రేణిగుంట : మండలంలోని జీపాల్యం రెవెన్యూలోని ప్రభుత్వ భూమిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలను నిలుపుదల చేసి ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరుతూ కృష్ణయ్య కాలువ ప్రజలు సోమవారం గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన జిల్లా అధికారులు చర్యలు చేపట్టాలని రేణిగుంట రెవెన్యూ అధికారులను ఆదేశించినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న ఆక్రమణదారులు స్థానిక కూటమి నాయకుల ద్వారా ఫిర్యాదు చేసిన వారిపై ఒత్తిళ్లకు పాల్పడుతున్నారు. ఫిర్యాదు వెనక్కి తీసుకోకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కొంటారని, ప్రభుత్వం నుంచి వచ్చే ఏ పథకాన్ని మీకు దక్కనీయమని బెదిరించినట్లు విశ్వసనీయ సమాచారం . కళ్ల ముందు జరుగుతున్న అక్రమాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తే ఇలా బెదిరించడం ఏంటని గ్రామస్తులు వాపోతున్నారు.

న్యాయమే గెలిచింది



మాజీ ఎమ్మెల్సీ యండపల్లి శ్రీనివాసులరెడ్డి

తిరుపతి సిటీ : లోక్‌సభ సభ్యుడు పెద్దిరెడ్డి మిథున్ రెడ్డికి 72 రోజుల పాటు అక్రమ కేసులో నిర్బంధించడం దారుణమని, ఎట్టకేలకు న్యాయం గెలిచి బెయిల్ మంజూరు చేయడం శుభపరిణామని మాజీ ఎమ్మెల్సీ యండపల్లి శ్రీనివాసులరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. మద్యం స్కాం కేసులో కూటమి ప్రభుత్వం కావాలని అక్రమ కేసులు బనాయించడం రాష్ట్ర ప్రజాస్వామ్య చరిత్రలో ఒక చీకటి అధ్యాయమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

రేపు ఓపీ, ఓటీలకు సెలవు

తిరుపతి తుడా : విజయ దశమి పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం స్విమ్స్ ఆసుపత్రి ఓపీ, ఓటీలకు సెలవు ప్రకటించడం జరిగిందని డైరెక్టర్, వీసీ డాక్టర్ ఆర్వీ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అత్యవసర విభాగం సేవలు యథాతథంగా కొనసాగుతాయని, రోగులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.



సూర్యప్రభ వాహనంపై శ్రీనివాసుడు

దేదీప్యం.. దివ్యతేజం

- ఉదయం సూర్యప్రభ, రాత్రి చంద్రప్రభ సేవలో శ్రీనివాసుడు
- నేడు రథోత్సవం

తిరుమల: శ్రీవారి బ్రహ్మోత్సవాలు వేడుకగా సాగుతున్నాయి. మంగళవారం ఉదయం సూర్యప్రభ, రాత్రి చంద్రప్రభ వాహన కాంతుల్లో మలయప్ప స్వామి దేదీప్యమానంగా భక్తులకు దివ్య దర్శనమిచ్చారు. ఏడో రోజు వాహన సేవల్లో పెద్ద జీయర్ స్వామి, చిన్నజీయర్‌స్వామి, టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్ పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా ఎనిమిదో రోజు బుధవారం శ్రీవారి రథోత్సవం నిర్వహించనున్నారు. గురువారం ఉదయం చక్రస్నానం సందర్భంగా టీటీడీ పుష్కరిణిలో భారీ ఏర్పాట్లు చేసింది.



వాహనసేవల్లో కళాకారుల ప్రదర్శన



చంద్రప్రభ వాహనంపై శ్రీవారు

ప్రైవేటీకరణను అడ్డుకుంటాం

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై నిరసన

- తిరుపతిలో అంబేద్కర్ విగ్రహం వద్ద వైఎస్సార్‌సీపీ ఎస్సీ నాయకులు, ప్రజల నిరసన
- కూటమి తీరుపై ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం ఆగ్రహం



తిరుపతిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యంతో పాటు వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం నాయకులు, ప్రజలు



చంద్రగిరి టవర్ క్లాక్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న దళిత నేతలు

తిరుపతి మంగళం: బడుగు, బలహీన వర్గాల పిల్లలు ఉచితంగా వైద్య విద్యను అభ్యసించాలన్న లక్ష్యంతో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి స్థాపించిన మెడికల్ కళాశాలలను ప్రాణాలు పోయినా ప్రైవేటు పరం కాకుండా అడ్డుకుంటామని ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం స్పష్టం చేశారు. తిరుపతిలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద మంగళవారం వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం ఆధ్వర్యంలో ప్రభుత్వ మెడికల్ కళాశాలలు ప్రైవేటు పరంపై ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం మాట్లాడుతూ.. ఐదేళ్ల జగనన్న పాలనలో కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో పేదల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధిని రెండు కళ్లుగా బావించి పాలన సాగించారన్నారు. కేవలం రెండేళ్లల్లో 17 మెడికల్ కళాశాలల స్థాపనకు కృషి చేసిన ఏకైక నాయకుడు జగనన్న అన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా వైద్య విద్యను అభ్యసించాలనుకున్న పేద విద్యార్థుల ఆశలను అడి ఆశలు చేసి మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం చేసేందుకు చంద్రబాబు పన్నాగం పన్నారని మండిపడ్డారు. పేదల అభ్యున్నతిని పక్కన పెట్టి రూ. వేల కోట్లు దండుకోవడానికి చంద్రబాబు మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం చేయడానికి కుట్రలు చేస్తున్నారన్నారు. అనంతరం వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు తలారి రాజేంద్ర, అనంతపురం ఇన్‌చార్జ్ నల్లాని బాబు మాట్లాడుతూ.. చంద్రబాబు ఎప్పుడు అధికారంలో ఉన్నా బడుగు బలహీన వర్గాల పట్ల చిన్నచూపు చూస్తారన్నారు. ఎస్సీలుగా ఎవ్వరైనా పుట్టాలనుకుంటారా? అన్నప్పుడే చంద్రబాబుకు ఎస్సీలంటే ఎంత చులకనో అర్థమవుతుందన్నారు. పవన్‌కళ్యాణ్‌కు చంద్రబాబు చేసే కుట్రలు కనబడడంలేదా? అని ప్రశ్నించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కోటూరు ఆంజనేయులు, పార్టీ ఎస్సీ విభాగం నగర అధ్యక్షుడు చేజెర్ల మురళి, పార్టీ నాయకులు సాకం ప్రభాకర్, వెంకటేష్, దేవదానం, బొగ్గుల వెంకటేష్ , అరుణ్‌కుమార్, శివకుమార్, వాసు యాదవ్, కడపగుంట అమరనాథ్‌రెడ్డి, మద్దాలి శేఖర్, మల్లం రవికుమార్, దినేష్‌రాయల్, ప్రసాద్, రత్నం, శారద, విజయలక్ష్మి పాల్గొన్నారు.

వైద్య విద్యను దూరం చేయొద్దు

చంద్రగిరి : గత ప్రభుత్వంలో నిర్మించిన మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం చేయొద్దని , పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేయకండని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నేతలు నిరసన వ్యక్తం చేశారు. చంద్రగిరి క్లాక్ టవర్ వద్దనున్న అంబేడ్కర్ విగ్రహం ముందు నిరసన తెలిపి ప్లకార్డులు పట్టుకుని ప్రభుత్వ తీరును ఎండగట్టారు. చంద్రగిరి నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎస్సీ సెల్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చంద్రగిరి నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నాయకులు మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో ఐదేళ్ల ముఖ్యమంత్రిగా ఉన్న జగన్మోహన్‌రెడ్డి 17 మెడికల్ కాలేజీలను కట్టిస్తే, 40 ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకునే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్ని మెడికల్ కాలేజీలను కట్టించారో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రయివేటు వ్యక్తులకు అప్పగించాలని చూడటం, పేద విద్యార్థులను వైద్య విద్యకు దూరం చేయడమే అవుతుందన్నారు. కార్యక్రమంలో చంద్రగిరి నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ అధ్యక్షుడు సెల్వం, తిరుపతి రూరల్ మండలం ఎస్సీ సెల్ అధ్యక్షుడు లక్ష్మయ్య, జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి మల్లారపు వాసు, చంద్రగిరి మండలం ఎస్సీ సెల్ అధ్యక్షుడు అజయ్, ప్రేమ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం నేతలు సందిపుట్టి బాల, వినోద్, ప్రవీణ్, హరి, గోపి, భాను పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఏపీడీకేఎస్ జిల్లా కమిటీ ఎంపిక

– అధ్యక్ష, కార్యదర్శులుగా రఘు, వెంకటయ్య


రఘు


వెంకటయ్య

తొట్టంబేడు : ఏపీ డప్పు కళాకారుల సంఘం జిల్లా నూతన కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక మహేష్ కల్యాణ మండపంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ ఆనందబాబు అధ్యక్షతన జిల్లా కమిటీ ఎంపిక జరిగింది. అధ్యక్షులుగా డి.రఘు, కార్యదర్శిగా సంక్రాంతి వెంకటయ్య, గౌరవ అధ్యక్షుడిగా అంగేరి పుల్లయ్య, ఉపాధ్యక్షులుగా పెంచలయ్య, టి.గురవయ్య, సహాయ కార్యదర్శులుగా అరుణాచలం, అక్బర్ బాషా, కోశాధికారిగా రెడ్డిపల్లి సురేష్ నియమితులయ్యారు. అదేవిధంగా కమిటీ సభ్యులుగా ప్రభాకర్, ముత్తు గోవిందస్వామి, వెంకటముని శ్రీనివాసులు, బాలగురవయ్య, సుబ్బరామయ్య, కె శ్రీనివాసులు, నారాయణ, గురవయ్య, అరుల్, కో- ఆప్షన్ సభ్యులుగా మునిశేఖర్, టి. నారాయణలు నియమితులయ్యారు. డప్పు కళాకారుల సమస్యలు, డిమాండ్ల సాధన కోసం నూతన కమిటీ కృషి చేస్తుందని అధ్యక్ష, కార్యదర్శులు పేర్కొన్నారు.

పేపర్ ప్లేట్ దుకాణం దగ్ధం


దగ్ధమైన వస్తు సామగ్రి

తిరుపతి అర్బన్ : తిరుపతి నగరంలోని పట్నం వీధిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఓ పేపర్ ప్లేట్ దుకాణం దగ్ధమైనట్లు అగ్నిమాపక విభాగానికి చెందిన ఏడీఎఫ్‌వో కిరణ్‌కుమార్ వెల్లడించారు. ఈ ఘటన మంగళవారం తెల్లవారు జామున చోటు చేసుకుందని చెప్పారు. తమకు సమాచారం అందిన వెంటనే ఘటనా స్థలానికి అగ్నిమాపక వాహనంలో తమతోపాటు మునిశంకర్ రెడ్డి, సత్య, రవికుమార్, ప్రకాష్ వెళ్లి మంటలను అదుపు చేసినట్లు పేర్కొన్నారు. అప్పటికే దుకాణం కాలిపోయిందని తెలిపారు. సకాలంలో చేరుకోవడంతో పక్క షాపులకు మంటలు వ్యాప్తి చెందకుండా అదుపు చేశామని వివరించారు. అయితే షాపు యజమాని మాధవి పేపర్ ప్లేట్లుతో పాటు మిషనరీ దెబ్బతినడంతో సుమారుగా రూ.10 లక్షల మేరకు నష్టం జరిగినట్లు చెప్పారని వెల్లడించారు.


మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

దేవదేవుడి అభయం


చంద్రునిపై ఊరేగుతున్న శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి


సూర్యునిపై దర్శనమిస్తున్న శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి

- సూర్య, చంద్రులపై స్వామి విహారం !
- బ్రహ్మోత్సవాలకు విద్యుత్తు వెలుగుల శోభ

తిరుపతి రూరల్ : తుమ్మల గుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. బ్రహ్మోత్సవాలలో ఏడవ రోజు మంగళవారం ఉదయం శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి వారు అనంత తేజోమయుడుగా సూర్యప్రభ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. స్వామిని దర్శించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

చంద్రునిపై చల్లనయ్య దీవెనలు

సమస్త భూ మండలానికి ప్రత్యక్ష దేవతలుగా కనిపించే సూర్య, చంద్రులను వాహనాలుగా చేసుకున్న దేవదేవుడు భక్తులకు అభయహస్తంతో ఆశీస్సులు అందించారు. ఉదయం సూర్యునిపై అత్యంత తేజస్సుతో దర్శనమిచ్చిన స్వామి వారు రాత్రికి చంద్రునిపై కొలువుదీరి చల్లనయ్యగా భక్తులు అందరికీ చల్లని దీవెనలను అందించారు.


సూర్య ప్రభ వాహన సేవలో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, హర్షిత్ రెడ్డి

చిరుజల్లుల నడుమ సూర్యప్రభ వాహన సేవ

సూర్య ప్రభ వాహన సేవ ఆరంభం నుంచే చిరుజల్లులు కురవడంతో ఆ చల్లని వాతావరణంలోనే స్వామి వారి వాహన సేవ ముందుకు సాగింది. ఆలయం నుంచి సూర్యునిపై కొలువు దీరిన స్వామి వారి వాహనం బయలు దేరినప్పటి నుంచే వర్షం కురవడంతో ఛత్రం నీడలో స్వామి వారు భక్తులకు దర్శనమిస్తూ ముందుకు సాగారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మి, కుమారులు చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి, సోదరుడు చెవిరెడ్డి రఘునాథరెడ్డి, చెవిరెడ్డి మంజుల దంపతులు వాహన సేవలో పాలు పంచుకున్నారు. వాహన సేవల్లో కళాబృందాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ప్రధాన ఆలయంతో పాటు పరిసరాలు అన్నీ విద్యుత్తు వెలుగులతో ఆకట్టుకుంటున్నాయి.

ఐసీడీఎస్‌కు అద్దె వాహనానికి సీల్డ్ కొటేషన్ ఆహ్వానం

తిరుపతి అర్బన్ : ఐసీడీఎస్ పరిధిలో నిర్వహిస్తున్న మిషన్‌శక్తి పథకంలో భాగంగా వన్‌స్టాప్ సెంటర్ కోసం ఓ వాహనం అద్దెకు తీసుకోవడానికి సీల్డ్ కొటేషన్ ఆహ్వానిస్తున్నట్లు పీడీ వసంతబాయి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. నెలకు అద్దె డ్రైవర్ జీతం, ఇంధనం, నిర్వహణ, పన్నులు, బీమా తదితర అన్నింటికి కలిపి రూ. 37,500 ఇస్తామని చెప్పారు. ఆసక్తి ఉన్నవారు ఈనెల 10వ తేదీ లోపు కలెక్టరేట్‌లోని ఐసీడీఎస్ జిల్లా ఆఫీస్‌లో దరఖాస్తులు ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం వాహన రిజిస్ట్రేషన్ పత్రాలు, డ్రైవర్ అర్హతలకు చెందిన పత్రాలను సీల్డ్ కవర్ ద్వారా అందించాలని సూచించారు. ఆసక్తి ఉన్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శ్రీగంధం దుంగలు స్వాధీనం

తిరుపతి అన్నమయ్యసర్కిల్ : తిరుపతి పరిధిలోని నగర వనంలో మంగళవారం శ్రీ గంధం చెట్లను అక్రమంగా నరికి మూడు దుంగలను తరలిస్తున్న ఇద్దరిని పట్టుకుని అరెస్టు చేసినట్లు అటవీ క్షేత్రాధికారి బి.సుదర్శన్ రెడ్డి తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. రహస్య సమాచారం మేరకు టి.ఎన్. పాలెం సెక్షన్ సిబ్బంది నగరవనం తనిఖీల్లో ఇద్దరు వ్యక్తులు గంధం చెట్టును కట్టింగ్ చేస్తుండం గమనించారు. వారిని చుట్టుముట్టి పట్టుకుని వారితో గంధపు దుంగలు, కటింగ్ సామగ్రితో పాటు ద్విచక్ర వాహనాన్ని అదుపులోకి తీసుకున్నారు. గంధం బరువు సుమారు 11.40 కేజీలు కాగా ద్విచక్ర వాహనంతో కలిపి వాటి విలువ సుమారు రూ.3 లక్షలుగా అంచనా వేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. తనిఖీల్లో ఎఫ్ఎస్‌వో చైతన్య, సిబ్బంది పాల్గొన్నారు.

స్టూడెంట్.. 'నంబర్ 1'


గోల్డ్ మెడల్ అందుకుంటున్న జీవితఖైదీ యుగంధర్


యుగంధర్(ఫైల్)

- జైలులో ఉంటూ విద్యాభ్యాసం
- గోల్డ్ మెడల్ అందుకున్న జీవితఖైదీ

ఏర్పేడు : ఓ హత్య కేసులో జీవితఖైదీగా జైలులో ఉంటూనే చదువుపై మక్కువతో ఉన్నత విద్యాభ్యాసం చేసి గోల్డ్ మెడల్ సాధించాడో యువకుడు.. మంగళవారం హైదరాబాద్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ దూరవిద్య యూనివర్సిటీ 26వ స్నాతకోత్సవంలో గోల్డ్ మెడల్ అందుకుని స్ఫూర్తిదాయకంగా నిలిచాడు. వివరాలు. ఏర్పేడు మండలం జంగాలపల్లికి చెందిన గునకల బోయశెట్టి, గునకల చెంగమ్మ దంపతుల కుమారుడు యుగంధర్(35) రేణిగుంట మండలం కరకంబాడి సమీపంలో జరిగిన ఓ హత్య కేసులో 2011, జూలై 18న జీవితఖైదు పడి కడప సెంట్రల్ జైలులో శిక్ష అనుభవిస్తున్నాడు. 15ఏళ్లుగా జైలులో గడుపుతున్న యుగంధర్ చదువుపై ఉన్న మక్కువను గుర్తించి జైలు అధికారులు ప్రోత్సహించటంతో జైలులోనే ఉంటూ దూరవిద్య ద్వారా విద్యాభ్యాసం చేశాడు. బీఏలో 8.2 జీపీఏ పాయింట్లు సాధించి రెండు తెలుగు రాష్ట్రాలలో మొదటి స్థానాన్ని సాధించాడు. దీంతో అంబేడ్కర్ ఓపెన్ యూనివర్శిటీ అధికారులు ఇటీవల అతడికి గోల్డ్ మెడల్‌ను ప్రకటించారు. మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన స్నాతకోత్సవంలో గోల్డ్ మెడల్‌ను అందుకున్నాడు. ఓల్డ్ ప్యాటర్న్‌లో రెండు బీఏ డిగ్రీలు, న్యూ ప్యాటర్న్‌లో రెండు డిగ్రీలు, 3ఎంఏ డిగ్రీలు పూర్తి చేసి అందరిని అబ్బురపరిచాడు. యుగంధర్ తండ్రి ఏడాది కిందట మృతి చెందగా, జంగాల పల్లిలో అతడి తల్లి చెంగమ్మ నివసిస్తోంది. తన బిడ్డ సత్ప్రవర్తన కింద తప్పును మన్నించి రాష్ట్రపతి క్షమాభిక్ష పెట్టి విడిచిపెట్టాలని యుగంధర్ తల్లి చెంగమ్మ, గ్రామ సర్పంచ్ నారాయణ కోరుతున్నారు. అచ్చం స్టూడెంట్ నెంబర్ వన్ సినిమా తరహాలో జైలులో ఉంటూ చదువుకుని ప్రతిభను కనబరిచిన యుగంధర్ ఎంతో మంది యువతకు స్ఫూర్తిగా నిలిచాడని సర్పంచ్ కొనియాడారు.

విద్యార్థిపై హత్యాయత్నంలో 11 మంది అరెస్టు

- ప్రేమ వ్యవహారంతోనే హత్యాయత్నం
- నిందితుల అరెస్టు చూపి, వివరాలను వెల్లడించిన సీఐ


నిందితుల అరెస్టు చూపిస్తూ, వివరాలను వెల్లడిస్తున్న సీఐ సునీల్ కుమార్

చంద్రగిరి : ఇద్దరి విద్యార్థులు ఒకే అమ్మాయిని ప్రేమించడంతో మరొక విద్యార్థి జీర్ణించుకోలేక మరో విద్యార్థిపై తన స్నేహితులతో కలసి హత్యాయత్నానికి పాల్పడ్డారని తిరుచానూరు సీఐ సునీల్ కుమార్ తెలిపారు. సెప్టెంబర్ 2న తిరుచానూరులోని నేతాజీ నగర్‌లో నివాసం ఉంటున్న దినేష్‌పై హత్యాయత్నానికి పాల్పడిన విషయం తెలిసిందే. ఈ మేరకు హత్యాయత్నానికి పాల్పడిన వారిని గుర్తించి, తిరుచానూరు పోలీసులు 11 మందిని అదుపులోకి తీసుకోగా, మరో ఇద్దరి కోసం గాలిస్తున్నారు. ఈ మేరకు మంగళవారం తిరుచానూరు సీఐ సునీల్ కుమార్ మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ.. డిగ్రీ రెండవ సంవత్సరం చదువుతున్న దినేష్, వీవీ నగర్‌కు చెందిన కుహల్ ఇద్దరూ ఒకే యువతిని ప్రేమించడంతో సెప్టెంబర్ 24న ఇద్దరి మధ్య విభేదాలు తలెత్తాయన్నారు. ఈ క్రమంలో కుహల్ ఫోన్ ద్వారా దినేష్‌ను తీవ్రంగా హెచ్చరించినట్లు తెలిసిందన్నారు. అనంతరం అదే రోజు రాత్రి కుహల్ మరి కొంత మంది మిత్రులను పిలిపించుకుని సింధూ సర్కిల్ సమీపంలో మద్యం సేవించారని, ఆపై దినేష్ నివాసానికి వెళ్లారన్నారు. ఇంట్లో ఉన్న దినేష్‌పై దాడికి పాల్పడి బయటకు తీసుకొచ్చి కత్తితో దాడికి పాల్పడినట్లు తెలిపారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన దినేష్ అక్కడే కుప్పకూలి పడిపోవడంతో, స్థానికులు తిరుపతి రుయాకు తరలించినట్లు చెప్పారు. బాధితుడు దినేష్ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తును ముమ్మరం చేసినట్లు పేర్కొన్నారు. ఈ క్రమంలో మంగళవారం 11 మంది నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు వారు తెలిపారు. వీరిలో కుహల్, గుణసాగర్, అజిత్ నాయక్, మహేష్, తేజ సాయి, చాణక్య, అనిల్, పూర్ణ చంద్, వినయ్, విష్ణును అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి హత్యాయత్నానికి ఉపయోగించిన బటన్ కత్తి, సుర కత్తి, మచ్చు కత్తితో పాటు ఐదు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. కేసులో మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారని, వారిని పట్టుకోవడానికి ప్రత్యేక బృందాల ద్వారా గాలిస్తున్నట్లు చెప్పారు. అనంతరం నిందితులను తిరుపతి కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ తెలిపారు. కేసును త్వరితగతిన ఛేదించడంతో ప్రతిభ కనబరిచిన సీఐ సునీల్ కుమార్, ఎస్ఐలు జగన్నాథ రెడ్డి, అరుణ, క్రైం పార్టీ సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో మంగళవారం భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 31 కంపార్టుమెంట్లు నిండిపోయాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 81,626 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 25,304 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.14 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనం లభిస్తోంది. దర్శన టిక్కెట్లు లేని వారికి 24 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో స్వామిని దర్శించుకోగలుగుతున్నారు. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది.

మిద్దెపై ఎగిసిపడిన మంటలు

నాయుడుపేటటౌన్ : నాయుడుపేట పట్టణంలోని బజారు వీధిలో రెండవ అంతస్తులో ఉన్న ఓ ఇంటి వద్ద ప్రమాదవశాత్తు మంగళవారం సాయంత్రం మంటలు అంటుకుని ప్రమాదం జరిగింది. స్థానికులు తెలిపిన మేరకు బజారు వీధిలో రెండవ అంతస్తులో ఉన్న ఓ ఇంటి వద్ద చందుప్రియ కుటుంబ సభ్యులు నివాసం ఉంటున్నారు. ఇంటి ఆవరణలో పాత చెక్క ముక్కలు, చెత్త నిల్వలు వేసి ఉన్నారు. అయితే చెత్త నిల్వల వద్ద ఒక్కసారిగా మంటలు అంటుకుని ఎగిసిపడ్డాయి. అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. అప్పటికే స్థానికులు మంటలపై నీళ్లు చల్లి కొంత మేరకు అదుపు చేశారు. అగ్నిమాపక శాఖ అధికారి సునీల్ కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది సంఘటనా స్థలం వద్దకు చేరుకుని మంటలను పూర్తిగా అదుపు చేశారు. బాణసంచా నిప్పు రవ్వలు పడి మంటలు చెలరేగి ఉండవచ్చునని అనుమానిస్తున్నారు. సుమారు రూ.20 వేల వరకు నష్టం జరిగినట్లు తెలిపారు.

జిల్లా క్రికెటర్లకు రంజీ, స్టేట్‌లో స్థానం


రంజీ ప్రాబబుల్స్‌కు ఎంపికైన అభిషేక్‌రెడ్డి, జ్ఞానేశ్వర్, దీపక్ సాయినాథ్ | రాష్ట్ర సీనియర్ ఉమెన్ టీ-20కి ఎంపికైన గ్రీష్మ, పద్మజ

తిరుపతి ఎడ్యుకేషన్: రంజి ట్రోఫి ప్రాబబుల్స్ క్యాంపు, స్టేట్ సీనియర్ ఉమెన్ టీ-20 ప్రిపరేటరీ క్యాంపునకు ఉమ్మడి చిత్తూరు జిల్లా క్రికెటర్లు స్థానం సాధించారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) విడుదల చేసిన రంజీ ట్రోఫీ 2025-26 ప్రాబబుల్స్ క్యాంపునకు బ్యాటింగ్ విభాగంలో అభిషేక్‌రెడ్డి, సీఆర్ జ్ఞానేశ్వర్, బౌలింగ్ విభాగంలో దీపన్ సాయినాథ్ చోటు దక్కించుకున్నారు. అలాగే ఏసీఏ సీనియర్ ఉమెన్స్ టీ-20 రాష్ట్ర ప్రిపరేటరీ క్యాంపునకు ఎం.గ్రీష్మ, ఈ.పద్మజ ఎంపికయ్యారు. వీరు విశాఖపట్నంలో నిర్వహించే జాతీయ స్థాయి టీ-20 మ్యాచ్‌లో మన రాష్ట్రం తరఫున ఆడనున్నారు. ఈ సందర్భంగా ఏసీఏ సంయుక్త కార్యదర్శి విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. ఉమ్మడి చిత్తూరు జిల్లా క్రికెటర్లు అన్ని ఫార్మాట్లలో ప్రతిభ చూపుతున్నారని, రానున్న రోజుల్లో ఏపీఎల్, ఐపీఎల్‌లోనూ స్థానం సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

నష్టాల నిమ్మ

- ఢిల్లీ మార్కెట్‌కు వద్దంటున్న వ్యాపారులు
- చెట్లు నరికి వేస్తున్న రైతులు
- సాగు కష్టంగా మారిందంటున్న రైతన్నలు

చిల్లకూరు : నిమ్మ ధరలు పతనం అవుతుండడంతో సాగుదారులు ఆందోళన చెందుతున్నారు. ఇక్కడేమో వేసవిని తలపించేలా ఎండలు మండిపోతుండడం, ఉత్తరాదిన భారీ వర్షాలు కురుస్తుండడంతో ఢిల్లీ మార్కెట్‌లో వ్యాపారులు నిమ్మ కాయలు వద్దంటున్నారని ఇక్కడ వ్యాపారులు రైతుల నుంచి కిలో నిమ్మ కాయలు రూ. 40 లోపే కొనుగోలు చేస్తున్నారు. సహజంగానే చలికాలం నిమ్మ కాయలకు కొంత డిమాండ్ ఉండదు. అయితే దీన్నే ఆసరాగా చేసుకొని వ్యాపారులు సిండికేట్‌గా మారి నిమ్మ రైతుల పొట్టుకొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వాతావరణ మార్పులతో..

ఈ ప్రాంతంలో ఎండలు విపరీతంగా ఉన్నప్పటికీ చిన్నపాటి వర్షాలు కొంత మేర పడడంతో నిమ్మ చెట్టుకు బలం వచ్చింది. దీంతో పూత పూసి కాపునకు వచ్చాయి. దిగుబడి బాగా పెరిగింది. అయితే మార్కెట్‌లో ధరలు అంతంత మాత్రంగా ఉండడంతో రైతులు కొంత మంది కూలీలను పెట్టి కోయించే పరిస్థితి లేక అలాగే వదిలేస్తున్నారు.

నరికేస్తున్న రైతులు

నిమ్మ ఒక్కసారి నాటితే కనీసం 30 ఏళ్ల వరకు కాపు కాస్తూనే ఉంటాయి. వయస్సు పడ్డ చెట్లు దిగుబడి ఎక్కువగా ఇవ్వకపోవడంతో రైతులు వాటిని నరికి వేస్తున్నారు. ఎక్కువ శాతం మంది సైదాపురం ప్రాంతాలలో నిమ్మ చెట్లు నరికేసి సరుగుడు మొక్కల సాగుకు సిద్ధం అవుతున్నారు. ఈ ఏడాది సుమారు 200 ఎకరాల వరకు రైతులు చెట్లు నరికేసినట్లు తెలుస్తోంది. ఎక్కువ శాతం రాపూరు, సైదాపురం, డక్కిలి , బాలాయపల్లి మండలాల్లో చెట్లు నరికేసినట్లు తెలుస్తోంది.


కోయకుండా వదలేయడంతో చెట్టు మొదళ్లలో రాలిన నిమ్మ కాయలు


మార్కెట్‌కు వచ్చిన నిమ్మ కాయలు

జ్యూస్ పరిశ్రమలు లేకపోవడంతో..

నిమ్మ రసంతో తయారు చేసే వివిధ రకాల ఉత్పత్తులకు ముడి సరుకును అందించేలా రసం నిల్వ చేసే సిట్రస్ పరిశ్రమలు అందుబాటులో లేకపోవడంతో పూర్తి స్థాయిలో నిమ్మ పంట మొత్తంగా ఉత్తర భారత దేశంలోని రాష్ట్రాల కొనుగోళ్లపైనే ఆధారపడాల్సి వస్తోంది. అదే జ్యూస్ పరిశ్రమలను ఏర్పాటు చేస్తే వారికి నిమ్మ కాయలను ఏడాది పొడవునా రైతులు సరఫరా చేసి మద్దతు ధర పొందే అవకాశం ఉంటుంది.

ఎగుమతులు జరిగే ప్రాంతాలు

నిమ్మ మార్కెట్ బాగా ఉండే సమయంలో గుజరాత్, పూణే, ముంబయి, బెంగుళూరు, చెన్నై, కోలకత్తా, సూరత్, ఢిల్లీ మార్కెట్‌కు ప్రతి రోజు కనీసం రెండు లారీలు (ఒక లారీ 22 టన్నులు) ఎగుమతులు జరిగేవి. నేడు ధరలు లేకపోవడంతో రైతులు మార్కెట్‌కు కాయలు తీసుకొచ్చేందుకు కూడా ముందుకు రావడం లేదు.

ఏడాది పొడవునా ధరలు పెరగడం లేదు



నిమ్మ వ్యాపారులు ఎగుమతి చేసే ఢిల్లీ మార్కెట్‌లో ధరలు ఉండడం లేదని ఇక్కడ వ్యాపారులు ధరలు తగ్గించేస్తున్నారు. మూడు డిక్కీలు (150 కేజీలు) నిమ్మ కాయలు కోసుకుని మార్కెట్‌కు వస్తే ఇద్దరు కూలీలకు రూ 600, ఆటో బాడుగ రూ.100, మొత్తంగా ఖర్చు రూ.700 అయ్యింది. వ్యాపారులకు కాయలు విక్రయిస్తే రూ 4,500 లెక్క కట్టారు. దీనికి సుమారు రూ. 2 వేలు ఖర్చు చేయాల్సి వస్తోంది. ఇలా ఉంటే సాగు ఎలా చేయగలం. – వేమయ్య, చిల్లకూరు

కాయలు వదిలేస్తున్నాం



పదెకరాలలో నిమ్మ సాగు చేస్తుండగా ప్రస్తుతం కాపు బాగానే వస్తోంది. అయితే మార్కెట్‌లో ధరలు రోజుకొకరకంగా మారిపోతున్నాయి. ఒక రోజు కిలో రూ.40 అంటారు, మరో రోజు రూ. 30 అంటారు. ఇలా వారంలోనే పలు వ్యత్యాసాలు ఉండడంతో అలాగే వదిలేస్తున్నాం. గతేడాది దసరా మార్కెట్‌లో రూ.60,70 పలికింది. ఇప్పుడు అందులో సగం కూడా లేదు.
– దామోదర్‌రాజు, రాజుల ఎరుగుంటపాళెం, సైదాపురం మండలం

అప్పల బాధతో వ్యక్తి ఆత్మహత్య


భాస్కర్ బాబు మృతదేహం

చంద్రగిరి : చేసిన అప్పును తీర్చే స్థోమత లేకపోవడంతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తిరుచానూరులో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. తిరుచానూరు పంచాయతీ పరిధిలోని ప్రశాంత్ నగర్‌లో నివాసం ఉంటున్న భాస్కర్ బాబు (38) స్థానికంగా జిరాక్స్ షాపును నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అయితే కొంత కాలంగా చేసిన అప్పులు తిరిగి చెల్లించలేక మానసిక ఒత్తిడికి గురయ్యాడు. నివాసంలో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ జగన్నాథరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.